నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 17 మే 2025 | KAMAREDDY

# ఇలా అయితే పనిచేయలేం..




నిజామాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉన్నతాధికారి తీరుతో కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సదరు అధికారి చర్యలతో విసుగు చెందిన వారు.. ఇలా అయితే తాము పనిచేయలేమని అంటున్నారు. కామారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు మూకుమ్మడి సెలవులు పెట్టేందుకు సిద్ధం అవుతున్నారు. ఓ అధికారి తీరుతో విసుగు చెందుతున్న వారంతా ఐక్యంగా ఓ నిర్ణయానికి వస్తున్నట్లు తెలిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సిబ్బందిని టార్చర్ చేస్తున్న అధికారి తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తంఅవుతున్నది. ఏడాది కాలంగా సతమతం అవుతున్నప్పటికీ ఎవ్వరికీ చెప్పుకోలేక భరిస్తూ వస్తున్నారు. కాగా ఈ మధ్య వేధింపులు మరీ ఎక్కువ కావడంతో చేసేదేమీ లేక సామూహిక సెలవులు పెట్టి, అతడి వేధింపుల నుంచి ఉపశమనం పొందేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. రైతులకు చేదోడు వాదోడుగా ఉంటూ.. వారి సంక్షేమం కోసం పని చేయాల్సిన వ్యవసాయ శాఖలోని సదరు అధికారి తీరుతో ఉద్యోగులంతా ఏకమవ్వడంపై సర్వత్రా చర్చ నడుస్తున్నది. ఏఈవోలు, ఏవోలు, ఆఫీస్ స్టాఫ్ కూడా అధికారి ప్రవర్తనతో బాధితులుగా మారినట్లుగా తెలుస్తున్నది. ప్రతి చిన్న విషయానికీ పని కట్టుకుని వేధించడం, పదే పదే ప్రశ్నలు వేస్తూ సతాయించడం, సంజాయిషీ పేరుతో కార్యాలయం చుట్టూ తిప్పుకోవడమే కాకుండా ఇతరత్రా అనైతిక కార్యక్రమాలకు ఉసిగొల్పుతుండడంపై సర్వత్రా వ్యతిరేకత ఏర్పడింది. గతంలో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో పని చేసిన సమయంలోనూ ఏవో, ఏఈవో, ఆఫీస్ స్టాఫ్ నుంచి ఇదే తీరుగా వ్యతిరేకతను మూటగట్టుకున్న సదరు అధికారి ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలోనూ అదే తరహాలో పని చేస్తూ ఉద్యోగులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో భాగంగానే సామూహికంగా సెలవులు పెట్టాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నది. నేడు లేదా రేపు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను కలిసి తమ బాధలను చెప్పుకునేందుకు వ్యవసాయ శాఖ ఉద్యోగులు సిద్ధం అవుతున్నట్లు సమాచారం.

### కన్నీళ్లు పెట్టుకుంటున్న ఉద్యోగులు...

గతంలో ఎప్పుడూ ఏ అధికారి వద్దా చూడని ప్రవర్తనను ప్రస్తుతం ప్రత్యక్షంగా చూస్తున్నట్లుగా పలువురు మండల వ్యవసాయాధికారులు, మండల విస్తర్ణాధికారులు వాపోతున్నారు. పని చేసే ప్రాంతంలో మంచి వాతావరణం ఉంటే రైతులకు అండదండగా నిలిచేందుకు వీలుంటుంది. సరైన వాతావరణం లేనప్పుడు ఉద్యోగులు మనసు పెట్టి పని చేసే అవకాశం లేకుండా పోతున్నది. అలాంటి దుస్థితి కామారెడ్డి వ్యవసాయ శాఖను చుట్టేసింది. విమర్శలు ఎదుర్కొంటున్న అధికారిల తీరుతో చాలా మంది కన్నీళ్లు పెట్టుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఇష్టానుసారంగా ఆంగ్ల పదాలను వాడుతూ బూతులు తిడుతున్నట్లు ఏవోలు బాధపడుతున్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడడంతోపాటు నిబంధనలకు వ్యతిరేకంగా పని చేయాలంటూ ఒత్తిడి చేయడంలో మతలబు ఏమిటి? అని సదరు అధికారి తీరుపై ఏఈవో, ఏవోలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- సిబ్బందిని వేధిస్తున్న వ్యవసాయ శాఖలోని ఓ అధికారి
- మూకుమ్మడి సెలవులకు సిద్ధమవుతున్న సిబ్బంది..?
- అధికారి తీరుతో జిల్లాలోని ఉద్యోగుల సతమతం
- గతంలోనూ తీవ్ర విమర్శలు వచ్చినా.. మార్పు కరువు
- కలెక్టర్‌ను కలిసేందుకు రెడీ అవుతున్న ఉద్యోగులు



ఫర్టిలైజర్ దుకాణాదారులకూ తప్పని వేధింపులు..

వ్యవసాయ శాఖ ఉద్యోగులతోపాటు సదరు అధికారితో కామారెడ్డి జిల్లాలోని పలు చోట్ల విత్తన, ఎరువు దుకాణాదారులు సైతం తీవ్ర వేధింపులకు గురవుతున్నట్లు సమాచారం. తనిఖీలు నిర్వహిస్తే తమకేమీ బాధ లేదని ఎరువులు, విత్తన దుకాణాదారులు చెబుతున్నారు. అనుమతుల్లేని వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవచ్చని పేర్కొంటున్నారు. సక్రమంగా కార్యకలాపాలు నిర్వహించే తమను అకారణంగా వేధించడం, పలు విధాలుగా టార్గెట్లు పెట్టడం ఏమిటని పలువురు వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించాలని ఓ వైపు వ్యవసాయ శాఖ ఉద్యోగులు, సిబ్బందితో పాటు మరోవైపు విత్తన, ఎరువుల వ్యాపారులు కోరుతున్నారు. సదరు అధికారి నుంచి విముక్తి ప్రసాదించాలంటున్నారు. కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశిస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని పలువురు వ్యవసాయాధికారులు బాహాటంగానే చెబుతున్నారు. సదరు అధికారి అనైతిక తంతుపై ఉన్నతాధికారులకు సైతం ఆధారాలతో ఫిర్యాదు చేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని అంటున్నారు. వ్యవసాయ శాఖలో నెలకొన్న అంతర్గత కల్లోలం, ఉద్యోగులకు ఓ అధికారికి మధ్య తలెత్తిన వివాదంపై కలెక్టర్ లేదా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది. తప్పు చేసిన వారిని గుర్తించి దండిస్తారా? లేదా గాలికి వదిలేస్తారా? అన్నది కాలమే నిర్ణయించాల్సి ఉంది.

- కామారెడ్డిలో మున్సిపల్ కార్మికుల ఆందోళన
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన
- ఎమ్మెల్యే స్పందించాలని వినతి


కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

## జీతాలు చెల్లించాలని ధర్నా

కామారెడ్డి, మే 16: తమకు ప్రతినెలా ఐదో తేదీన జీతాలు చెల్లించాలని కోరుతూ కామారెడ్డి మున్సిపల్ కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. బల్దియా కార్యాలయం ఎదుట శుక్రవారం బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడారు. వేతనాలు త్వరగా చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. నవంబర్‌లో విధుల నుంచి తొలగించిన 11మంది కార్మికులను పనిలోకి తీసుకోవాలని, వారికి ఆరు నెలల వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. 60 ఏండ్లు పైబడిన వారి స్థానంలో వారి కుటుంబీకులను పనిలోకి తీసుకోవాలని కోరారు. మున్సిపల్‌లోని పలువురు అధికారులు రాజకీయ నాయకులకు తొత్తులుగా మారి కార్మికుల పొట్టకొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధర్నా చేస్తే పనిలో నుంచి తీసివేస్తామని హెచ్చరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉదయం నుంచి పని బంద్ చేసి ఆందోళన చేస్తున్నా.. ఒక్క అధికారి కూడా స్పందించడం లేదన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే కల్పించుకొని తగిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు, కార్యదర్శి మహబూబ్, శానిటేషన్ విభాగం ఉపాధ్యక్షుడు సంతోష్, శివరాజవ్వ, జ్యోతి, కార్మికులు నర్సింహులు, లక్ష్మీరాజ్, కిషన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మత్తు ఇంజెక్షన్ ఇచ్చి జీవాల చోరీకి యత్నం

స్థానికుల అప్రమత్తతతో పరారైన దుండగులు

వినాయక్‌నగర్, మే 16: మూగజీవాలకు ఇంజెక్షన్ ఇచ్చి చోరీకి యత్నించిన ఘటన నిజామాబాద్ నగరంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. నగరంలోని రేడియో స్టేషన్ ఎదురుగా గాయత్రీనగర్ ఏరియాలో రాత్రి పడుకున్న ఒక ఆవు, రెండు కంకలను చోరీ చేసేందుకు దుండగులు వాటికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చాడు. దీంతో అవి స్పృహ కోల్పోయాయి. వాటిని వాహనంలో వేసుకొని తీసుకెళ్లేందుకు యత్నించారు. అలికిడి కావడంతో స్థానికులు మేల్కొన్నారు. చోరీ చేస్తున్నట్లు గుర్తించి అరవడంతో దుండగులు కారులో పరారయ్యారు. విషయం తెలుసుకున్న ఫోర్త్ టౌన్ ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఆవు యజమాని అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దుండగులు పారిపోయిన కారును గుర్తించేందుకు సీసీ టీవీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.


మత్తు ఇంజెక్షన్ ఇవ్వడంతో స్పృహ కోల్పోయిన ఆవు

## హ్యాపీ జర్నీ మేడం!



నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్ శుక్రవారం ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అమెరికా పర్యటన విజయవంతంగా పూర్తిచేసుకొని రావాలని ఆకాంక్షిస్తూ పుష్పగుచ్ఛం అందజేసి.. శుభాకాంక్షలు తెలిపారు.
– లింగంపేట, మే 16


వరి కుప్పకు నిప్పంటిస్తున్న రైతు

## ఆగ్రహ 'జ్వాల'

- ధాన్యం కొనుగోలు చేయడం లేదని వరి కుప్పకు నిప్పు
- పంట తూకం వేయకపోవడంతో ఆగ్రహం
- కేంద్ర నిర్వాహకుల తీరుపై మండిపాటు

భిక్కనూరు, మే 16: ధాన్యం కొనుగోలు చేయడం లేదని అన్నదాత ఆగ్రహం వ్యక్తంచేశాడు. పంటను కొనుగోలు కేంద్రానికి తరలించి రోజులు గడుస్తున్నా.. తూకం వేయకపోవడంతో ఆవేదన చెందిన రైతు వరి కుప్పకు నిప్పంటించాడు. ఈ ఘటన భిక్కనూరులో గురువారం చోటుచేసుకున్నది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. భిక్కనూరులోని హరిజనవాడకు చెందిన రమేశ్ భిక్కనూరు సిద్ధరామేశ్వర ఆలయానికి చెందిన ఎకరన్నర పొలం కౌలు చేస్తున్నాడు. వరి సాగుచేయగా.. పంటను కోసి 22రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి తరలించాడు. అయినా నిర్వాహకులు కాంటా చేయకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కేంద్ర నిర్వాహకులు డబ్బులు ఇచ్చిన వారి ధాన్యం ముందుగా తూకం వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తూ గురువారం మధ్యాహ్నం వరి కుప్పకు నిప్పంటించాడు. నిర్వాహకులతో వాగ్వాదానికి దిగాడు. ఒకవైపు అకాల వర్షం కురుస్తున్నదని, పంటను ఎలా కాపాడుకోవాలని వారిపై మండిపడ్డాడు. స్పందించిన నిర్వాహకులు గురువారం రాత్రి కాంటా పెట్టారు.



- మంత్రి సురేఖ వ్యాఖ్యలు సర్కారు కరప్షన్‌కు నిదర్శనం
- కొండా కామెంట్స్‌పై రాహుల్ గాంధీ స్పందించాలి
- సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద అవినీతి భూతం.. తెలంగాణకు శరాఘాతం
- సర్కారు అవినీతిపై సభా కమిటీ వేయాలి.. సీబీఐతో విచారణ జరిపించాలి
- సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

## కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కమీషన్ల పాలన

ఖలీల్‌వాడి, మే 16: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కమీషన్ల పాలన అని, తాజాగా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పనులను బట్టి మంత్రులకు లంచాలు ఇవ్వనిదే ఫైలు ముందుకు కదలదని ఆయన శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి మంత్రి పేషీలో ఇదే తంతు కొనసాగుతున్నదని, సచివాలయం అంతా అవినీతి కంపు కొడుతున్నదని తెలిపారు. ఫైళ్లు క్లియర్ చేయడానికి మంత్రులకు డబ్బులు ఇవ్వాలని మంత్రి కొండా సురేఖ చెప్పారని, ఆమె కామెంట్స్‌పై రాహుల్ గాంధీ స్పందించాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద అవినీతి భూతమని, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి ఆయన శరాఘాతమని నిప్పులు చెరిగారు. పీసీసీ అంటే ప్రదేశ్ కరప్షన్ సెంటర్ అని, అది ఇండియన్ నేషనల్ క్రైమ్ అండ్ కరప్షన్ పార్టీ అని జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అవినీతి పునాదుల మీద పెరిగిన కాంగ్రెస్ పార్టీ పంచభూతాలనే భోంచేసిన పాపాల పుట్ట అని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యమంటేనే ల్యాండ్, శాండ్, మైన్, వైన్ మాఫియా అని ఆరోపించారు. నాటి ఆంగ్లేయులది, నేటి కాంగ్రెస్‌ది ఒకటే వంకరబుద్ధి అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఈస్టిండియా కంపెనీ అయితే బీజేపీ నార్తిండియా కంపెనీ అని.. ఈ రెండు పార్టీలూ దేశాన్ని దోచుకునే దోపిడీ కంపెనీలేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ దేశాన్ని పాడు చేస్తున్న మిడతల దండు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటేనే సంపన్నులకు ఆపన్నహస్తం, పేదలకు రిక్తహస్తం అని, అందినకాడికి ప్రజాధనాన్ని నొక్కేయడం, మెక్కేయడంలో ఆ పార్టీది అందెవేసిన చేయి అని తెలిపారు. కాంగ్రెస్ గరీబీ హఠావోను గాలికొదిలేసి, పైసా కమావో బాట పట్టిందని ధ్వజమెత్తారు. అవినీతి అమీబా కాంగ్రెస్ అని, దాని డీఎన్ఏలోనే కరప్షన్ ఉన్నదని నిప్పులు చెరిగారు. మంత్రి కొండా సురేఖ చేసిన కామెంట్స్ సర్కారు అవినీతి చట్టబద్ధమనే విధంగా ఉన్నాయని, కాంగ్రెస్ అవినీతి బాగోతాలపై సభా కమిటీ వేయాలని, సీబీఐతో విచారణ జరిపించాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## టిప్పర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలి

- నల్లబ్యాడ్జీలు ధరించి జర్నలిస్టుల ఆందోళన
- బోధన్ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత


బోధన్ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

బోధన్, మే 16: జర్నలిస్టులపై అనుచితంగా వ్యవహరించిన టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు బోధన్‌లో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలపై ప్రత్యేక కథనం రాసినందుకు బోధన్ నమస్తే తెలంగాణ ఆర్సీ ఇన్‌చార్జి ఎస్.బలరామరాజు, టీ న్యూస్ రిపోర్టర్ తారాచంద్ దిష్టిబొమ్మలను ఇసుక అక్రమ రవాణాచేసే టిప్పర్ల యజమానులు, ట్రాక్టర్ల డ్రైవర్లు బుధవారం దహనం చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక రవాణా చేస్తున్న వారు జర్నలిస్టుల తీరును ప్రశ్నించడంపై జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఇసుక అక్రమ రవాణా కేసుల్లో నిందితులుగా ఉన్న టిప్పర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిప్పర్లు, ట్రాక్టర్లపై నమోదైన కేసులను బహిర్గతం చేయాలన్నారు. పత్రికా స్వేచ్ఛపై దాడిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆఫ్ బోధన్ ప్రింట్ మీడియా మాజీ అధ్యక్షుడు తేళ్ల రవికుమార్ మాట్లాడుతూ.. వాస్తవాలు వెలుగులోకి తెచ్చిన జర్నలిస్టులపై అనుచితంగా వ్యవహరించడంపై అధికారులు స్పందించాలన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే సహించేది లేదన్నారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బోధన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌హెచ్‌వో వెంకటనారాయణకు వినతిపత్రం సమర్పించారు. నిరసన ప్రదర్శనలో ప్రెస్ క్లబ్ ఆఫ్ బోధన్ మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ (వాసు), మాజీ గౌరవ అధ్యక్షుడు గడ్డం గంగులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, జర్నలిస్టులు ఖుర్షీద్, లింబూరి లక్ష్మణ్, రాజులాల్, బండారి పోశెట్టి, ఉమాకాంత్, సాంబశివరావు, అహ్మద్, నల్వాల కృష్ణ, గోపి, కారం స్వామి, జగన్, రాజేశ్, కడికె శివ, అశోక్, అబ్బయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

JOB OPENINGS
OPEN POSITIONS
- Production Chemist 20 Members
  Qul: B.Sc., Exp.0 to 5 Yrs.
- QA Executives 4 Members
  Qul: B.Sc., Exp. 0 to 5 Yrs.
- R&D Executives 4 Members
  Qul: B.Sc/M.Sc., Exp. 0 to 5 Yrs.
- Chemical Engineer 4 Members
  Qul: B.Tech., Exp. 0 to 5 Yrs.

WALK IN 19 to 24 MAY
VIJAYA SAI LABORATORIES INDIA PVT. LTD.
Jangampally- 503102, Cell: 9948460432